క్లుప్తంగా

పేద మహిళకు చేయూత



మహిళకు కుట్టుమెషీన్ అందజేస్తున్న చేయూత సభ్యులు

బోట్‌క్లబ్: స్థానిక తూరంగి అగ్రహారానికి చెందిన పట్నాల విజయకుమారికి రోటరీ చేయుత సంస్థ చైర్మన్ ఎం.రవికుమార్ ఆధ్వర్యంలో రూ.20 వేల విలువైన కుట్టుమెషీన్‌ను మంగళవారం అందజేశారు. ఆమె భర్త ఆటో డ్రైవర్‌గా జీవిస్తూ ఇటీవల మృతి చెందాడు. సంస్థ సభ్యురాలు నళిని ఈ కుట్టుమెషీన్‌కు అవసరమైన ఆర్థిక సహకారాన్ని అందించారు. ఈ విద్యా సంవత్సరం నుంచే వారి పిల్లలను దత్తత తీసుకొని డిగ్రీ, పాలిటెక్నిక్ అభ్యసించడానికి అవసరమైన ఏర్పాటు చేస్తామన్నారు. కార్యదర్శి హలీం, కోశాధికారి నారాయణమూర్తి, ఉపాధ్యక్షులు ఎస్‌కేవీ బాషా, మహిళా విభాగ చైర్‌పర్సన్ డేగల లక్ష్మి సభ్యులు హర్షిత్, ఎస్‌వీ చలపతి, నళిని పాల్గొన్నారు.

రూ.10 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న సత్యనారాయణ తదితరులు

కాకినాడ రూరల్: రమణయ్యపేట వైద్యనగర్ క్యాంపు కార్యాలయం వద్ద నియోజకవర్గ పరిధిలోని లబ్ధిదారులు 13 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి రూ.10 లక్షలకు చెక్కులను నియోజవకర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ పంపిణీ చేశారు. ముత్యాల సతీష్, కరప జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, జీఎస్‌టీయూకే వీసీ మెంబరు బెజవాడ సత్యనారాయణ, ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ వర్సిటీ సభ్యుడు చింతా ఈశ్వరరావు, రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ జమ్మలమడక నాగమణి, కాపు కార్పొరేషన్ డైరెక్టరు లింగం రవి, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టరు జంగా గగారిన్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



రోగులకు ఉచితంగా మందులు అందిస్తున్న ట్రస్ట్ చైర్మన్ మహేష్

బోట్‌క్లబ్: స్థానిక నరసన్ననగర్‌లో ఆర్‌వీ గోపాలరావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ట్రస్ట్ చైర్మన్ రాజారపు మహేష్ ప్రారంభించారు. ట్రినిటీ హాస్పిటల్ సౌజన్యంతో నిర్వహించిన ఈ శిబిరంలో 500 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. ట్రినిటీ వైద్యులు ముత్యాల మురళీకృష్ణ, యాళ్లరాజా, పేకేటి కిశోర్, అనురాధ ఆధ్వర్యంలో వైద్యులు పరీక్షించారు. అనంతరం రెడ్‌క్రాస్ వికలాంగుల చిన్నారులకు భోజనం అందించారు. ఈ కార్యక్రమంలో గోపాలరావు, శేషు, కిరణ్, పాల్గొన్నారు.

ముస్లింలకు స్వయంపాకం అందజేత



సులేమాన్ దంపతులకు స్వయింపాకం అందించిన సామాజికవేత్త రమణరాజు

బోట్‌క్లబ్: రంజాన్ సందర్భంగా సామాజికవేత్త దూసర్లపూడి రమణరాజు రామకృష్ణారావు పేటకు చెందిన మహమ్మద్ సులేమాన్ దంపతులకు మంగళవారం బియ్యం, పంచదార, గోధుమ, జీడిపప్పు సేమ్యా సామాగ్రితో స్వయంపాకం అందజేశారు. రంజాన్ మాసంలో ప్రతివారం ముస్లింలకు ఇఫ్తార్ విందుగా వారి ఇళ్లకు వెళ్లి స్వయంపాకం అందిస్తామన్నారు. భారతీయ తత్వంతో సమసమాజ దేశ ప్రగతికి అన్ని మతాల పండుగ రోజులను జరుపుకొంటున్నామన్నారు.

రెడ్‌క్రాస్‌కు తొలి నేత్రదానం

కాకినాడ: రెడ్‌క్రాస్ సంస్థ నూతనంగా ఏర్పాటు చేసిన నేత్రనిధికి మంగళవారం తొలి నేత్రదానాన్ని అందించారు. ఇటీవల రాష్ట్ర గవర్నర్ అబ్దుల్‌నజీర్ రెడ్‌క్రాస్ నేత్రనిధిని ఇక్కడ ప్రారంభించారు. ఇందులో భాగంగా యానాం ప్రాంతానికి చెందిన పాలెపు ఆదినారాయణ మరణానంతరం ఆయన కుటుంబ సభ్యులు నేత్రదానం చేశారని జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ వైడీ రామారావు తెలిపారు. ఇద్దరు అంధులకు దృష్టి ప్రసాదించాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్న కుటుంబ సభ్యులను రామారావు అభినందించారు. దాత కుటుంబ సభ్యులను జిల్లా రెడ్‌క్రాస్ అధ్యక్షుడు డాక్టర్ కృతికాశుక్లా అభినందించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటైన నేత్రనిధి వల్ల అంధత్వ నివారణకు ప్రజలు కూడా సహకరించాలని కలెక్టర్ కోరారు.

ప్రజల నుంచి పుట్టిన పార్టీ వైఎస్సార్ సీపీ

- ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ
- ఘనంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవం



వైఎస్సార్ సీపీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, పార్టీ నగరాధ్యక్షురాలు శివప్రసన్న, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి తదితరులు



పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న కాకినాడ పార్లమెంటరీ కో ఆర్డినేటర్ సునీల్



రమణయ్యపేట వైద్యనగర్ వద్ద ఆవిర్భావ వేడుకల్లో పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న కురసాల సత్యనారాయణ. చిత్రంలో బెజవాడ సత్యనారాయణ తదితరులు

కాకినాడ: ప్రజల కష్టాల్లో నుంచి పుట్టిన పార్టీ వైఎస్సార్ సీపీ అని ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఆదేశాల మేరకు 14వ ఆవిర్భావ దినోత్సవాన్ని పార్టీ నగర అధ్యక్షురాలు, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న అధ్యక్షతన నిర్వహించారు. ఎమ్మెల్సీ పద్మశ్రీ మాట్లాడుతూ ఎన్నో ఒడిదొడుకులు, కష్టాలను ఎదుర్కొని అధికారాన్ని చేపట్టి, ప్రజాభిమానాన్ని చూరగొన్న పార్టీ వైఎస్సార్ సీపీ అన్నారు. కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలిస్తూ పార్టీ పటిష్టతను దేశవ్యాప్తంగా చాటి చెప్పారన్నారు. పార్టీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి ప్రజాక్షేత్రంలో ప్రజల మన్ననలు చూరగొని దేశచరిత్రలోనే సువర్ణాక్షరాలతో లిఖించేలా పార్టీ ప్రతిష్టను ఇనుమడింపజేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సీఎం అడుగుజాడల్లో నడుస్తూ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి విద్య, వైద్యం, గృహనిర్మాణ రంగాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారన్నారు. ఏఎంసీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, రాష్ట్ర ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి రావూరి వెంకటేశ్వరరావు, లారీ యజమానుల సంఘ అధ్యక్షుడు ఎస్ఎస్ రాజు, ద్వారంపూడి చారిటబుల్ ట్రస్ట్ ఆర్గనైజర్ కర్రి వీర్రెడ్డి (చినబాబు), మాజీ కార్పొరేటర్లు నల్లబెల్లి సుజాత, రాగిరెడ్డి బన్ని, సంగాని నందం తదితరులు పాల్గొన్నారు. పార్టీ కార్యాలయంలో కేక్‌కట్ చేసి, స్వీట్లు పంచారు. వైఎస్సార్ సీపీ పతాకాన్ని ఆవిష్కరించారు.

చరిత్ర సృష్టించిన వైఎస్సార్ సీపీ

ఎన్నో ఆటుపోట్లను తట్టుకుని ఢిల్లీ పెద్దలను ఎదిరించి స్థాపించిన పార్టీ వైఎస్సార్ సీపీ అని కాకినాడ పార్లమెంటరీ నియోజకవర్గ పార్టీ కో–ఆర్డినేటర్ చలమలశెట్టి సునీల్ పేర్కొన్నారు. మంగళవారం తన కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మరోసారి చరిత్ర సృష్టించబోతోందన్నారు. సీఎం జగన్ ఆకాంక్షకు అనుగుణంగా విజయపతాకాన్ని ఎగురవేయనున్నామని చెప్పారు. ప్రజల కష్టాల్లో నుంచి పుట్టి ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అన్ని వర్గాల ఆదరణను చూరగొన్న వైఎస్సార్ సీపీకి ఉజ్వల భవిష్యత్ ఉందన్నారు. ఎన్ని రాజకీయ శక్తులు ఏకమైనప్పటికీ వైఎస్సార్ సీపీ ప్రభంజనం ముందు కొట్టుకుపోవడం తథ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొప్పన శివ, బత్తుల సాయి, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చీకట్ల కిశోర్‌తో పాటు పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మరోసారి అధికారంలోకి వైఎస్సార్ సీపీ

కాకినాడ రూరల్: వైఎస్సార్ సీపీ 14వ ఆవిర్భావ వేడుకలు రమణయ్యపేట వైద్యనగర్‌లో జిల్లా పార్టీ కార్యాలయం వద్ద మంగళవారం ఘనంగా జరిగాయి. పార్టీ జెండాను నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ ఆవిష్కరించారు. ఆయనతో పాటు జీఎస్‌టీయూకే వీసీ సభ్యుడు బెజవాడ సత్యనారాయణ, ముత్యాల సతీష్, కరప జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, చింతా ఈశ్వరరావు, పెంకే సత్తిబాబు, గోపుశెట్టి బాబ్జీ, గగారిన్, లింగం రవి, రామిరెడ్డి, వలవల వెంకటేశ్వరరావు, జమ్మలమడక నాగమణి, కరీం భాష, నల్ల రాణి, బాబులు, రావూరి వెంకటేశ్వరరావు, నేమాం సర్పంచ్ రామదేవు చిన్నా, అనుసూరి ప్రభాకరరావు, వడ్డి మణికుమార్, తదితరులు పార్టీ జెండాకు వందనం చేశారు. అనంతరం దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలో మరోసారి అధికారంలోకి రాబోతుందన్నారు. ఈ సంక్షేమ పథకాలు మరే పార్టీ అమలు చేయలేదని, పేద ప్రజలు గుండె చప్పుడుగా వైఎస్సార్ సీపీ మారిందన్నారు.

ఉద్యోగుల పక్షపాతిగా సేవలందిస్తా : ఎమ్మెల్యే ద్వారంపూడి



ఎమ్మెల్యే ద్వారంపూడిని సత్కరిస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులు

కాకినాడ: ఉద్యోగుల పక్షపాతిగా సేవలందిస్తానని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక డి కన్వెన్షన్‌లో ఏపీ ఎన్‌జీజీఓ, ఏపీ జేఏసీ కాకినాడ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో తన వంతు తోడ్పాటు ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి ప్రజలకు దగ్గరగా మెరుగైన సేవలందించగలిగానంటే అదంతా వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు అందించిన తోడ్పాటేనని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను ఉద్యోగుల దృష్టికి సంబంధిత శాఖల దృష్టికి తీసుకువెళ్లిన వెంటనే యుద్ధప్రాతిపదికన స్పందించి వాటిని పరిష్కరించేందుకు తోడ్పడ్డారన్నారు. ఇదే సహకారాన్ని భవిష్యత్తులో కూడా అందించాలని అదే సమయంలో వారి పట్ల సానుకూల దృక్పథంతో పని చేస్తానని చెప్పారు. దివంగత మహానేత వైఎస్సార్ స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చి సేవలందిస్తున్నానని ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చేలా పని చేసే ఉద్యోగులను కూడా అంతే గౌరవిస్తానని స్పష్టం చేశారు. ఎటువంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే అవసరమైతే సీఎం దృష్టికి కూడా తీసుకువెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. ఏపీ జేఏసీ సభ్య సంఘాల ఆత్మీయ సమావేశంలో రాష్ట్ర ఎన్‌జీఓల సంఘం ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్, ఏపీ ఎన్‌జీజీఓ, జిల్లా జేఏసీ చైర్మన్ రామ్మోహన్, కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ, ట్రెజరీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పాము శ్రీనివాసరావు, జెడ్పీ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్, పంచాయతీ కార్యదర్శుల సంఘ అధ్యక్షుడు జొన్నాడ నరసింహారావు, సీపీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులు బాషా, రవికుమార్, కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చటర్జీ, వివిధ ప్రభుత్వ శాఖల విభాగాల ప్రతినిధులు, మహిళా ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో భారీగా చేరికలు



జనసేన పార్టీ నుంచి వచ్చిన వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



వైఎస్సార్ సీపీలో చేరిన మత్స్యకారులతో కురసాల సత్యనారాయణ తదితరులు

కాకినాడ సిటీ: రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, రూరల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై తూరంగి ఏఎస్ఆర్ కాలనీకి చెందిన సుమారు 100 మంది జనసేన కార్యకర్తలు స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు జగడం అప్పారావు, గొల్లపల్లి బాబులు, జగడం శ్రీహరి, దండుప్రోలు సత్యనారాయణల సమక్షంలో వైఎస్సార్ సీపీలో మంగళవారం చేరారు. తమ ప్రాంత అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తున్న కన్నబాబును గెలిపించుకోవడమే కాకుండా పేదల సంక్షేమానికి నిరంతరం శ్రమిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేయడానికి తాము అహర్నిశలు కృషి చేస్తామని కార్యకర్తలు వివరించారు. పార్టీలో చేసిన వారికి వైఎస్సార్ సీపీ నాయకులు అప్పారావు, బాబులు, శ్రీహరి పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో రామాలయం కమిటీ యూత్ సభ్యులు ఆకుల రామకృష్ణ, అండిబోయిన చిన్ని బొందల సంజయ్, చిల్లా సతీష్, గెద్దాడ ధనరాజ్ తదితరులు పార్టీలో చేరారు.

వైఎస్సార్ సీపీలో మత్స్యకారుల చేరిక

కాకినాడ రూరల్: మండలంలోని వాకలపూడి ఫిషింగ్ హార్బర్ పేటకు చెందిన మత్స్యకారులు భారీగా వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీ నాయకుడు బసవా ప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం రమణయ్యపేట వైద్యనగర్ క్యాంపు కార్యాలయం వద్ద వైఎస్సార్ సీపీలోకి టీడీపీ, జనసేన నుంచి కురసాల సత్యనారాయణ, ముత్యాల సతీష్‌ల సమక్షంలో చేరడంతో వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. వైఎస్సార్ సీపీలో చేరిన వారిలో అంగాడి నూకరత్నం, కర్రి నాగమణి, ఓలేటి సతీష్, గంగాభవాని, నాగరాజు, సతీష్, పాలెపు చిన నూకరాజు తదితరులు 100 మంది వరకు ఉన్నారు. కరప జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, నాయకులు బెజవాడ సత్యనారాయణ, గోపుశెట్టి బాబ్జీ, జమ్మలమడక నాగమణి, చింతా ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాల్లో యువత రాణించాలి

- నన్నయ వర్సిటీ క్యాంపస్ ప్రిన్సిపాల్ ప్రశాంతశ్రీ
- ఉత్సాహంగా జిల్లా స్థాయి యూత్ మాక్ పార్లమెంట్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రశాంతశ్రీ

కాకినాడ రూరల్: యువత రాజకీయ రంగంలోనూ రాణించాలని ఆదికవి నన్నయ వర్సిటీ క్యాంపస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.ప్రశాంతశ్రీ సూచించారు. భారత ప్రభుత్వ యువజన, క్రీడ మంత్ర శాఖ ఆధ్వర్యంలో స్థానిక వర్సిటీ ఎంఎస్ఎన్ క్యాంపస్‌లో రాజనీతిశాస్త్ర విభాగంలో జిల్లాస్థాయి యూత్ మాక్ పార్లమెంట్ నిర్వహించారు. ప్రశాంతశ్రీ, జిల్లా యువజన అధికారి దూలం కిశోర్ ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ యువత రాజకీయాల్లో క్రియాశీలకంగా పాల్గొని దేశాన్ని మరింత అభివృద్ధిపథంలో నడిపించాలని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న జిల్లా నెహ్రూ యువ కేంద్రం యాజమాన్యానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అధ్యాపకులు డాక్టర్ ఎం.నాని బాబు సమన్వయకర్తగా వ్యవహరించగా స్పీకర్‌గా రాజనీతి శాస్త్ర విద్యార్థి ఎ.మల్లేశ్వరి, ప్రధాన మంత్రిగా బల జయదీప్, అపోజిషన్ లీడర్‌గా పి.వరహాలు వివిధ మంత్రిత్వ శాఖలో క్యాంపస్ విద్యార్థులు వ్యవహరించారు. కార్యక్రమంలో రాజనీతి శాస్త్ర హెచ్ఓడీ డాక్టర్ కె.జోసెఫ్ స్టీఫెన్, డాక్టర్ కె.హరిబాబు, డాక్టర్ జి.గోపి, యువ కేంద్రం ప్రతినిధి సత్తిబాబు, తదితర అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, యువ కేంద్ర వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

నామినేషన్ల దాఖలులో జాగ్రత్తలు అవసరం

- నియమావళి కచ్చితంగా పాటించాలి
- రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఆర్వో వెంకటరావు సూచన



రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షిస్తున్న ఈఆర్వో వెంకటరావు

కాకినాడ: ఎన్నికలలో పోటీచేసే అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసే సమయంలో ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఈఆర్వో, కమిషనర్ జె.వెంకటరావు సూచించారు. మంగళవారం సాయంత్రం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నామినేషన్ల సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలను ఆయా పార్టీల ప్రతినిధులకు వివరించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించాలని కోరారు. అభ్యర్థుల ఖర్చులను ఎలా దాఖలు చేయాలో వివరించారు. కాగా ఆయా ఎన్నికల బృందాల వెంట ఉండే వీడియోగ్రాఫర్లతో కూడా కమిషనర్ సమావేశమయ్యారు. ఇచ్చిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటిస్తూ చేపట్టాల్సిన విధులను తెలియజేశారు. పారదర్శకంగా బాధ్యతలు నిర్వర్తించాలని స్పష్టం చేశారు. సమావేశంలో రావూరి వెంకటేశ్వరరావు (వైఎస్సార్ సీపీ), తుమ్మల రమేష్, బాలాజీ (టీడీపీ), పలివెల వీరబాబు (సీపీఎం)తోపాటు బీజేపీ, బీఎస్పీ వంటి వివిధ పార్టీల ప్రతినిధులతో పాటు డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, డీసీపీ హరిదాసు, తహసీల్దార్ దొర, డిప్యూటీ తహసీల్దార్లు సీతాపతిరావు, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్ఏ ఆధ్వర్యంలో ఓటరు అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న డీఎస్‌డీఓ శ్రీనివాస్‌కుమార్, క్రీడాకారులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం కాకినాడలో ఓటరు అవగాహన ర్యాలీని నిర్వహించారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాస్‌కుమార్, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి శ్రీనివాస్, జిల్లా సైనిక్ వెల్ఫేర్ అధికారి కృష్ణారావు ఈ ర్యాలీలో పాల్గొని ఓటు ప్రాధాన్యం, విలువలుపై ప్రసంగించారు. ఈ సందర్భంగా డీఎస్‌డీఓ శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ కలెక్టర్ కృతికాశుక్లా ఆదేశాల మేరకు ఓటరు అవగాహనా ర్యాలీని డీఎస్ఏ ఆధ్వర్యంలో నిర్వహించామన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఈ ర్యాలీ నాగమల్లితోట జంక్షన్ అల్లూరి సీతారామ రాజు విగ్రహం జంక్షన్ నుంచి భానుగుడి వరకు కొనసాగింది. ఈ ర్యాలీలో జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు రవిరాజు, పోలీస్ శాఖ ప్రతినిధులు, 250 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

ఓటుహక్కుపై చైతన్యపరచండి

కాకినాడ సిటీ: రానున్న ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగంపై ప్రజల్లో చైతన్యాన్ని తీసుకువచ్చే స్వీప్ కార్యకలాపాల్లో భాగంగా రాష్ట్ర ఎన్నికల కమిషన్ రూపొందించిన వాల్‌పోస్టర్‌ను మంగళవారం కలెక్టరేట్‌లో ఎన్నికల అధికారి, కలెక్టర్ కృతికా శుక్లా అధికారులతో కలిసి ఆవిష్కరించారు. జిల్లాలో కొత్తగా ఓటు హక్కు పొందిన యువతపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి ఓటు హక్కు ప్రాధాన్యాన్ని తెలియపరిచేలా చైతన్య కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. జిల్లా రెవెన్యూ అధికారి డి.తిప్పే నాయక్, సీపీవో పి.త్రినాథ్, జిల్లా స్వీప్ నోడల్ అధికారి పి.విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కరప హైస్కూల్‌కు పీఎం ఎక్స్‌లెన్స్ అవార్డు

కరప: స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలను డీఈఓ పి.రమేష్ మంగళవారం సందర్శించి, పలు అంశాలపై చర్చించారు. ప్రైమ్ మినిస్టర్ ఎక్స్‌లెన్స్ అవార్డుకు జిల్లా నుంచి ఎంపికైన పాఠశాలల్లో కరప హైస్కూలు ఒకటని, ఈ పాఠశాల పరిశీలనకు కేంద్ర బృందం రానుందన్నారు. ఆ సమయానికి పాఠశాలను అన్ని అంశాలలో ముందుండేలా సిద్ధం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. నాడు–నేడు పనులను పరిశీలించి, త్వరగా పూర్తిచేయాలని సూచించారు. ఎంఈఓ పి.సత్యనారాయణ, ఇన్‌చార్జి హెచ్‌ఎం బి.స్వర్ణరాణి, బి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

పేదల ఉత్పత్తుల కోసం వన్ స్టేషన్–వన్ ప్రొడక్ట్

- ఎమ్మెల్సీ పద్మశ్రీ
- దేశవ్యాప్తంగా ప్రారంభించిన ప్రధాని మోదీ



స్టాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ

కాకినాడ: అల్పాదాయ బడుగు వర్గాల ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించే లక్ష్యంతో కాకినాడ టౌన్ రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన వన్‌స్టేషన్–వన్ ప్రొడక్ట్ స్టాల్‌ను మంగళవారం ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ ప్రారంభించారు. దేశవ్యాప్తంగా ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించగా, కాకినాడ టౌన్ రైల్వే స్టేషన్‌లో ఎమ్మెల్సీ ఈ స్టాల్‌కు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో జెడ్ఆర్‌యూసీసీ సభ్యులు వైడీ రామారావు, బీజేపీ నాయకులు గట్టి సత్యనారాయణ, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

మహిళల పురోభివృద్ధికి చర్యలు

కాకినాడ: మహిళల ఆర్థికాభివృద్ధి, ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుంటోందని మెప్మా డైరెక్టర్ వి.విజయలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం కాకినాడలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన మెప్మా సిబ్బంది, రిసోర్స్ పర్సన్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు స్వయం సమృద్ధి సాధించేందుకు ఆహా క్యాంటిన్లు, ప్రగతి యూనిట్లు, పట్టణ సమృద్ధి యూనిట్లు, ఈ–మార్కెట్లు, అర్బన్ మార్కెట్లు నిర్వహిస్తున్నామన్నారు. మహిళల కోసం నిర్వహిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి సాధించేలా అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో మెప్మా పీడీ ప్రియంవద, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

జేసీ ప్రవీణ్ ఆదిత్యకు సత్కారం



జేసీ ప్రవీణ్ ఆదిత్యను సత్కరిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా, ఆర్డీవోలు, డీఆర్వో తదితరులు

కాకినాడ సిటీ: జేసీ సీవీ ప్రవీణ్ ఆదిత్య అధికారులను సమన్వయం చేసుకుంటూ నైపుణ్యంతో ఉత్తమ సేవలు అందించారని కలెక్టర్ కృతికా శుక్లా అభినందించారు. సాధారణ బదిలీల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఆయనను పశ్చిమగోదావరి జేసీగా బదిలీ చేసిన నేపథ్యంలో మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ కృతికా శుక్లా, డీఆర్వో తిప్పేనాయక్, కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు, కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు ఇట్ల కిశోర్, జె.సీతారామారావు తదితరులు జేసీ ప్రవీణ్ ఆదిత్యను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించే గొప్ప అవకాశం తనకు దక్కిందని, తనకు సహకరించిన అధికారులందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు.

టెన్త్ విద్యార్థులు ఒత్తిడికి గురి కావద్దు

కరప: విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలని ప్రముఖ ఎముకల వ్యాధి నిపుణుడు డాక్టర్ బొండా సూర్యారావు పేర్కొన్నారు. స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నతపాఠశాలలో మంగళవారం ఆయన పదో తరగతి విద్యార్థులతో సమావేశమై పరీక్షలపై అవగాహన కల్పించారు. ఎంఈఓ పి.సత్యనారాయణ, ఇన్‌చార్జి హెచ్‌ఎం బి.స్వర్ణరాణి, మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, స్టాఫ్ సెక్రటరీ ఎం.రమేష్, విద్యా కమిటీ మాజీ చైర్మన్ కె.వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపురంలో పోలీసుల కవాతు

కాకినాడ రూరల్: సార్వత్రిక ఎన్నికల సజావుగా జరిగేందుకు శాంతి భద్రతలకు విఘాతం కలిగించేవారికి హెచ్చరికగా తిమ్మాపురం పోలీసు స్టేషన్ పరిధిలో కేంద్ర ఆర్మ్‌డ్ దళాలతో పోలీసులు గ్రామాలలో మంగళవారం కవాతు నిర్వహించారు. ఉదయం పండూరు, తమ్మవరం గ్రామాలలోను, సాయంత్రం సూర్యారావుపేట, నేమాం గ్రామాలలో ప్రధాన వీధుల్లో కవాతు చేసి, స్థానికులకు అవగాహన కల్పించారు. రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి కెనరా బ్యాంక్ వితరణ



వృద్ధులకు నిత్యావసర వస్తువులు అందజేస్తున్న కెనరా బ్యాంక్ ఎంప్లాయిస్ వైస్ చైర్మన్ అరుణ

బాలాజీచెరువు: కెనరా బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ (సీబీఈయూ)కాకినాడ యూనిట్ ఆధ్వర్యంలో ఏపీఎస్‌పీ రెడ్‌క్రాస్ వృద్ధాశ్రమానికి నిత్యావసర వస్తువులు, పండ్లు, వాటర్ డిస్పెన్సర్, ఫ్యాన్లు అందజేశారు. కెనరా బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర వైస్ చైర్మన్, సెంట్రల్ కమిటీ సభ్యులు పి.అరుణ చేతుల మీదుగా నిర్వహించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఇటువంటి కార్యక్రమాలు ఏటా నిర్వహించడం సంతోషంగా ఉందని అరుణ పేర్కొన్నారు. అలాగే పెద్దాపురంలో మన ఇల్లు ఆశ్రమానికి నాలుగు సీలింగ్ ఫ్యాన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కమిటీ వైస్ చైర్మన్ శ్రీధర్, సభ్యులు యు.రాంబాబు, జి.శ్రీధర్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రైతుకూలీ సంఘం నాయకుల ఎన్నిక

కాకినాడ సిటీ: ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రెండోసారి కర్నాకుల వీరాంజనేయులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా వల్లూరి రాజబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయవాడలో జరిగిన కార్యక్రమంలో వీరు ఎన్నికైనట్టు రాజబాబు మంగళవారం తెలిపారు. తాము ప్రజా పోరాటాలను తీవ్రతరం చేయడంలో క్రియాశీలకంగా పని చేస్తామన్నారు.

సోషల్ ఆడిట్‌పై ఆన్‌లైన్ శిక్షణ

కాకినాడ రూరల్: సమగ్ర శిక్ష పథకము కింద పాఠశాలలో నిర్వహించిన సోషల్ ఆడిట్‌పై ఆన్‌లైన్ శిక్షణను మధ్యాహ్నం 1 నుంచి 3 గంటల వరకు గూగుల్‌మీట్ ద్వారా నిర్వహించారు. మండల విద్యాశాఖాధికారులు ఎల్.గణేష్‌బాబు, నామ ఏసుదాసు నిర్వహించగా, సీఎంవో చామంతి నాగేశ్వరరావు పరిశీలకులుగా హాజరయ్యారు. జీవీఎస్ సుబ్బారావు రిసోర్స్ పర్సన్‌గా ధ్రువీకరించారు. 77 మంది ప్రధానోపాధ్యాయులు ప్రభుత్వ యాజమాన్యాల నుంచి, ఐదుగురు సీఆర్‌పీఎస్ కార్యక్రమంలో పాల్గొన్నారు. పాఠశాల విద్యాకమిటీ పాఠశాలలోని సౌకర్యాలను పరిశీలించి సర్కిల్ ఎవాల్యుయేషన్ టూల్‌లో నమోదు చేయాల్సి ఉంటుందన్నారు.